క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ బోధన



పెబ్బేరు రూరల్: ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని కళాశాల అధ్యాపకులు కురుమూర్తి అన్నారు. ప్రైవేటుకు దీటుగా అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు చేరాలని సూచించారు. బుధవారం శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 1వ సెంటర్, కంభాళాపురం గ్రామాల్లో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ప్రభుత్వ కళాశాలల్లో కల్పించే వసతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణమూర్తి, శ్రీదేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



ఆత్మకూర్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ తేజస్‌నందు లాల్ పవార్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని ఎంవీరామన్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులను కలెక్టరేట్‌లో కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థులు శ్లోక, వాత్సల్య, దీపిక, ధనుష్‌చంద్ర, నిహారి, హరికృష్ణ, సయ్యద్‌రిహాన్, అభిగ్న, సాయి ప్రణీత్‌రెడ్డి, దీపక, పాఠశాల యాజమాన్యంతో పాటు, ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



పెబ్బేరు రూరల్: మండలంలోని యాపర్లకు చెందిన మాజీ ఎంపీపీ లలితమ్మతో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి వనపర్తి పట్టణంలోని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో అభివృద్ధి పనుల్లో అందరు కలిసికట్టుగా పనిచేసి సంక్షేమ పథకాలు ప్రజకు అందే విధంగా చూడాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నందిమల్ల యాదయ్య, చెన్నరాములు, రాగి వేణు, గడ్డం వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రింక్లర్లు పంపిణీ చేయాలి

కొడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో స్ప్రింక్లర్లు కోసం డీడీలు కట్టిన వెంటనే పంపిణీ చేయాలని రైతులు పర్వతాలు, నాగేష్, బాలస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం కిందట డీడీలు చెల్లించి హార్టికల్చర్ అధికారులకు ఇచ్చినా ఇంత వరకు స్ప్రింక్లర్ల అందజేయలేదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వానా కాలం సీజన్‌లోనైనా స్ప్రిక్లర్లు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెద్దకొత్తపల్లి: దేవల్‌తిరుమలాపురం గ్రామానికి చెందిన బొల్లె దేవేందర్‌కు సంబంధించిన గేదె బుధవారం విద్యుదాతుకానికి గురై మృతి చెందింది. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి బొల్లె ఉత్తయ్య వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ స్తంభం విరిగింది. గేదె మేతమేస్తూ విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. పశు వైద్య అధికారి మధు మృతి చెందిన గేదెను పరిశీలించారు.

నర్సులకు సన్మానం

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న నర్సులను అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర నాయకురాలు శోభ మాట్లాడుతూ నర్సుల సేవలు వెలకట్టలేనివి అన్నారు. కరోనా సమయంలో వారి సేవలను ఎప్పటికి మరిచిపోలేమన్నారు. వైష్ణవి, లక్ష్మీనర్సింహగౌడ్, శ్రీనివాసులు, సంపత్, నర్సులు భాగ్యమ్మ, వెంకటమ్మ, మణెమ్మ, జ్యోతి, స్వప్న పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లింక్ రోడ్లు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. పర్యవేక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడంతో రోడ్లు ప్రమాదభరితంగా దర్శనమిస్తున్నాయి. రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్లు అయినప్పటికి ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మండలంలోని మేడిపూర్, అంతారం, గోవిందాయిపల్లి మీదుగా ఐతోల్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు ఎట్టిదారిపల్లి సమీపాన ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలకు తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.

అద్దె భవనాల్లో కార్యాలయాలు



అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్ (ఫైల్)



తహసీల్దార్ కార్యాలయం (ఫైల్)

- ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాల్లేవు
- రేవల్లి మండలంలో ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి
- కనీస సౌకర్యాలు లేక అవస్థలు

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలం నుంచి విడిపోయి సుమారు ఎనిమిదేళ్ల క్రితం పన్నెండు గ్రామాలతో రేవల్లి మండల కేంద్రంగా ఏర్పాటయింది. ఏళ్లు గడుస్తున్నా రేవల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించకపోవడంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్లకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. కార్యాలయాల్లో అరకొర సౌకర్యాలు ఉండటంతో అటు సిబ్బంది, ఇటు కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండలం ఏర్పాటయినంత మాత్రాన సరిపోదు.. దానికి అన్ని హంగులు ఏర్పాటు చేసినప్పుడే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ పరిస్థితి

నాలుగు వేల చదరపు అడుగుల స్థలంలో తహసీల్దార్ కార్యాలయం నిర్మించాలని గతంలోనే ప్రతిపాదనలు పంపామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు సైతం గతంలో రెండుసార్లు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించడంతో పాటు దానికి సంబంధించిన స్థలం చూశామని, ప్రాసెస్ నడుస్తోందని రేవల్లి ఎస్ఐ తెలిపారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయానికి భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ గదిలో కొనసాగిస్తున్నారు. ఎంఈఓ కార్యాలయం కోసం నిర్మాణం చేసిన భవనంలో ఎంపీడీఓ కార్యాయలం నడిపిస్తున్నారు. కస్తూర్బా గాంధీ భవనం లేక నాగపూర్ సమీపంలోని పాత భవనంలో కస్తూర్బా గాంధీ పాఠశాల కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు లేక ఓ పక్క ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతుంటే మరోపక్క కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అందుబాటులో లేని కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇరుకు గదులతో ఇబ్బందులు



తహసీల్ కార్యాలయంలో సరిపోయినన్ని గదులు లేవు. కార్యాలయంలో సిబ్బందికి అవసరమైన మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. ప్రజలు సైతం కూర్చునేందుకు సరైన వసతులు లేవు. కొత్త కార్యాలయం నిర్మాణం చేస్తే బాగుంటుంది. స్థలం సరిపోవడంతో అడుగు ముందుకు పడట్లేదు. కాంపౌండ్ సరిగా లేదు. పాలకులు సహకరించి కొత్త కార్యాలయం నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నాం.

– లక్ష్మీదేవి, తహసీల్దార్, రేవల్లి

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బోరు మోటార్‌ను బిగిస్తున్న నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రంలో తాగునీటి ఇబ్బందులను మంత్రి జూపల్లి సహకారంతో పరిష్కరించినట్లు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, మండల కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, బ్రహ్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నూతన బోరు మోటార్లను బిగించినట్లు వారు పేర్కొన్నారు. మండల కేంద్రంలో తాగునీటి ఇబ్బంది ఉన్న విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకవెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన ప్రత్యేక నిధులను మంజూరు చేశారన్నారు. మండల కేంద్రంలోని మోమినవాడ, తెలుగు వాడలో 5 హెచ్‌పీ, పోలీస్ స్టేషన్ సమీపంలో 7 హెచ్‌పీ బోరు మోటార్లను బిగించి తాగునీటి ఇబ్బందులు తొలగించామన్నారు. నీటి ఇబ్బందిని తలెత్తకుండా మంత్రి సహకారంతో రెండు నూతన బోర్లను డ్రిల్లింగ్ చేయిస్తామన్నారు. తాగునీటి సమస్యను పరిష్కారించడంపై మండల కేంద్రం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిచ్చన్న, వడ్డెపరశురాం, నిరంజన్‌యాదవ్, బాల్‌రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట బస్టాండ్‌లో సౌకర్యాలు కరువు



కొత్తకోట బస్టాండ్‌లో మూసి ఉంచిన మరుగుదొడ్లు

కొత్తకోట రూరల్: ప్రతి రోజు వందలాది ప్రయాణికులు వెళ్లే కొత్తకోట బస్టాండ్‌లో కనీస అవసరాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు జిల్లా కేంద్రం నుంచి మహబూబ్‌నగర్, హైదరాబాద్, నారాయణపేట, ఇతర ప్రాంతాలకు వెళ్లే వందలాది మంది ప్రయాణికులు కొత్తకోట నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే కొత్తకోట బస్టాండ్‌లో కనీస అవసరాలు తీర్చుకునేందుకు మరుగుదొడ్లు, టాయిలెట్స్ లేకపోవడంతో పాటు క్యాంటీన్, ఇతర స్టాల్స్ లేనందున ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డు కొంతకాలంగా మూసి వేయడంతో మహిళ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు కాంట్రాక్టర్ టాయిలెట్స్ ఎప్పుడు తెరుస్తాడో, ఎప్పుడు మూస్తాడో ఎవరికి తెలియదు. ప్రయాణికుల అవసరాలు తీర్చే ఆర్టీసీ అధికారులు మాత్రం తమకు తెలియనట్టుగా ఉండిపోవడంపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారుల పని తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వనపర్తి డిపో మేనేజర్‌తో పాటు ఆర్టీసీ ఉన్నతాధికారులు కొత్తకోట బస్టాండ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపి కనీస అవసరాలు ఏర్పాటు చేయడంతో పాటు స్టాల్స్, క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గాలివీస్తే కరెంట్ కట్..



విద్యుత్ అంతరాయంతో అమరచింతలో కమ్ముకున్న చీకటి

అమరచింత: చిన్నపాటి గాలి వీచిందంటే చాలు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలివేస్తుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా విద్యుత్ అంతరాయం తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గతంలో ఎంతటి ఈదురు గాలులతో కూడిన వర్షాలు వచ్చినా కరెంట్‌ను కట్ చేయని అధికారులు ప్రస్తుతం చీటికి మాటికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పరిస్థితులు దాపరించాయని విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ట్రాన్స్‌కో లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ లేక పోవడంతో సమస్యను ఎవరికి చెప్పాలో తెలియడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేసవి క్రీడా శిబిరాల ఏర్పాటులో వివక్ష

వీపనగండ్ల: జిల్లాలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడల క్యాంపుల ఏర్పాటులో కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మూడు మండలాలను ఎంపిక చేయకపోవడంతో పలువురు క్రీడాకారులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో క్రీడలపై యువతకు ఆసక్తి కల్పించాలన్న ఉద్దేశ్యంతో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, యోగా తదితర వాటిలో వనపర్తి నియోజకవర్గానికి చెందిన మండలాలనే ఎంపిక చేసి వీపగండ్ల, చిన్నంబావి, పాన్‌గల్ మండలాలను ఏ ఒక్క క్రీడకు ఎంపిక చేయలేదని వాపోయారు. కొన్ని మండలాల్లో ఒకటి, రెండు క్రీడలకు సంబంధించిన క్యాంపులను కూడా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించి కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన మూడు మండలాల్లో వేసవి క్రీడల క్యాంపులను ఏర్పాటు చేయించాలని పలువురు క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీరు వృథా



అమరచింత: మండలంలోని నందిమళ్ల ఎక్స్ రోడ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలో తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడినా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా గ్రామంలోని ఆయా వార్డులకు పైప్‌లైన్ల ద్వారా తాగునీటిని అందించే పైప్ లీకేజీ కారణంగా నీరంతా వృథాగా పారుతూ నీటి కుంటను తలపిస్తుంది. కలుషిత నీటి కారణంగా ప్రజలు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్



ఈర్లదిన్నె పంచాయతీ పరిధిలోని సెగ్రిగేషన్ షెడ్ పరిస్థితి

అమరచింత: సెగ్రిగేషన్ షెడ్లు తడి, పొడి చెత్తలతో ఎక్కడా కనిపించడం లేదు. మండలంలోని ఈర్లదిన్నె పంచాయతీ పరిధిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్ ఇందుకు భిన్నంగా కనిపిస్తుంది. ఇక్కడి సెగ్రిగేషన్ షెడ్‌లో అక్కడే నివసిస్తున్న జాలర్లు కోళ్లు పెంచే బుట్టలను నిల్వ ఉంచుకునేందుకు వీటిని వినియోగిస్తున్నారు. దీంతో మచ్చుకైనా ఇక్కడ తడి, పొడి చెత్త కనిపించలేని స్థితి నెలకొంది. ఇంటింటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి వాటితో సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేసి, దాన్ని అమ్మడం ద్వారా పంచాయతీకి ఆదాయం చేకూర్చుకోవాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్తలను నిల్వ ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐడియా అదుర్స్..



ద్విచక్ర వాహనానికి నీడనిచ్చే గొడుగు

అమరచింత: వేసవి ఎండల నుంచి రక్షణ పొందేందుకు ఓ ద్విచక్ర వాహనదారుడు వినూత్నంగా ఆలోచించి అందరి దృష్టిని ఆకర్శిస్తున్నాడు. తన ద్విచక్రవాహనానికి పైభాగంలో ఒక స్టాండును ఏర్పాటు చేసి ముఖానికి వేడి తగలకుండా ఫైబర్ గ్లాసు బిగించడంతో పాటు ఎండ నుంచి కాపాడేలా గొడుగులా ఓ రేకును అమర్చాడు. దీంతో వడగాలితో పాటు ఎండ వేడి నుంచి రక్షణ లభిస్తుందని వాహనదారుడు తెలిపాడు. అమరచింత మీదుగా మరికల్ వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు స్థానిక బస్టాండ్ రహదారిపై వెళ్తుండగా సాక్షి క్లిక్‌మనిపించింది.

ఐదు రోజుల ఉపాధి కూలి రూ.25!

- వృద్ధులు, మహిళలు 5 మీటర్లు తీస్తారా?
- ఉపాధి కూలీలతో ధర్నా నిర్వహిస్తాం

మానవపాడు: ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు పోవద్దని, ఉపాధి పనులు ఆయా గ్రామాల్లోనే చేసుకునే విధంగా మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం గ్రామీణ స్థాయిలో నీరుగారుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చెన్నిపాడు గ్రామానికి చెందిన వంశీ ఉపాధి కూలి పనికి ఐదు రోజులు వెళ్లాడు. ఐదు రోజులకు మొత్తం డబ్బులు రూ.25 వచ్చాయి. బుధవారం మండలంలోని చెన్నిపాడులో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ మేట్లతో సమావేశం నిర్వహించారు. గ్రామీణస్థాయిలో ఉపాధి పనికోసం మహిళలు, వృద్ధులు, భర్తలేనివారు వెళ్తుంటారు. వారు ఒక్కొక్కరు 5మీటర్లు గుంతలను తవ్వుతారా? అంటూ కూలీలు ప్రశ్నించారు. ఈ సంవత్సరం ఎండలు, వేడి తీవ్రత విపరీతంగా ఉంది. కూలీలకు టెంట్లు ఏర్పాటు చేశారా? ఎండ తీవ్రతతో వృద్ధులు, మహిళలు దాదాపు 3 కిలోమీటర్లు కాలినకన నడిచి వెళ్తుంటారు? వారికి ఎవైనా చర్యలు తీసుకున్నారా? అని టెక్నికల్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. ఆయా గ్రూపులకు సంబంధించి మెడికల్ కిట్లు అందించారా అంటూ ఉపాధి అధికారులను ప్రశ్నించారు. వారానికి కేవలం రూ.45 మాత్రమే వస్తున్నాయి. ఆశించిన స్థాయిలో డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి కూలీలకు సంబంధించి కూలీ డబ్బులు ఎక్కువ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధికూలీలు కోరుతున్నారు.

బీటీ రోడ్లు అధ్వానం



గుంతలమయంగా మారేడున్నె రోడ్డు



బీటీ కొట్టుకుపోయిన యాపట్ల రోడ్డు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల గుంతలమయంగా రోడ్లు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. పదేళ్ల నుంచి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామాలకు వెళ్లే రహదారులు అస్తవ్యస్తంగా మారాయి.

అధ్వానంగా రహదారులు

సాతాపూర్ నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు మారేడుదిన్నె గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయి కంకర తేలింది. జగన్నాథపురం నుంచి యాపట్ల క్రాస్ రోడ్డు వరకు ఉన్న బీటీ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. కొత్తపేట గ్రామానికి వెళ్లే రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. కొల్లాపూర్ నుంచి మహాసముద్రం వెళ్లే రోడ్డు 10 కిలోమీటర్ల వరకు దెబ్బతింది. నక్కలపల్లి నుంచి వెనచర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు మరింత దారుణంగా ఉంది. కల్వకోల్ నుంచి తీర్నాంపల్లి, మాధవస్వామినగర్ గ్రామల ప్రజలు రాకపోకలకు కొనసాగించేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దకార్పాముల నుంచి మర్రికల్ వెళ్లే దారి కంకర తేలింది. ముష్టిపల్లి నుంచి తెలకపల్లి రోడ్డంతా గుంతలుగా ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మరమ్మతు చేయాలి

మండల కేంద్రం నుంచి అయా గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్ల మరమ్మతు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. గుంతలుగా వెంటనే పూడ్చాలి. వాహనాలు దెబ్బతింటున్నాయి. వృద్ధులు ప్రయాణించలేని దుస్థితి ఏర్పడింది. అధికారులు సమస్య వెంటనే పరిష్కరించాలి.

– నర్సింహ, పెద్దకొత్తపల్లి

ప్రతిపాదనలు పంపించాం

నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్లు దెబ్బతిన్నది వాస్తవమే. మరమ్మతు కోసం ఆర్అండ్‌బీ శాఖ ద్వారా నిధుల మంజూరు కోసం కృషి చేస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు చేపడుతాం.

– నాగేంద్రం, ఎంపీడీఓ, పెద్దకొత్తపల్లి

బాధిత కుటుంబాలకు పరామర్శ



గోప్లాపూర్‌లో బాలుడి తండ్రికి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్‌అలీ రెండేళ్ల కుమారుడి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ పంపించిన రూ. 15 వేలు ఆర్థికసాయం పంపించారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహబూబ్‌అలీ కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని జూపల్లి అరుణ్‌కు తెలియపర్చడంతో స్పందించిన ఆయన ఆర్థికసాయం పంపించారని తెలిపారు. కార్యక్రమంలో పుల్లారావు, విండో డైరెక్టర్ సాయిప్రసాద్‌గౌడ్, దశరథం, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌నాయక్‌కు..

జెడ్పీటీసీ లక్ష్మి భర్త చంద్రశేఖర్‌నాయక్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. చంద్రశేఖర్‌నాయక్ ఇటీవల స్వగ్రామం అన్నారంతండాలో ఇంట్లో కాలు జారి కిందపడటంతో కాళ్లు ఫ్యాక్చర్ అయిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల బీఆర్ఎస్ నాయకుడు జ్యోతినందన్‌రెడ్డి, బలవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరుకు చెందిన శీలం శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ మండల నాయకుడు బీచుపల్లియాదవ్ పరామర్శించారు. ఆయన పార్థీవ దేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బాలుయాదవ్, రమణరెడ్డి, వడ్డెమాన్ బిచ్చన్న, పెద్ద లక్ష్మయ్య, కల్లు శ్రీను, నరసింహ, ఖాజా, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామానికి చెందిన మేకల లక్ష్మి ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రూ.5వేలు పంపించారు. బుధవారం స్థానిక నాయకులు శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్‌రెడ్డి గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటంబ సభ్యులకు రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, నాగన్న, బుడ్డయ్య, రాములు, నాయకులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

కొత్తకోట: పట్టణ కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచాల జనార్దన్‌గౌడ్(75) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల క్రితం మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి బుధవారం కొత్తకోటకు చేరుకొని రాచాల జనార్దన్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారెడ్డి వెంట కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి బోయేజ్, సాయన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

వరుసగా ఢీకొన్న మూడు వాహనాలు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో బుధవారం ఉదయం 44వ నంబర్ జాతీయ రహదారిపై వరుసగా మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో వాహనదారులకు ప్రమాదం తప్పిపోయింది. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో శాఖాపూర్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక ఉన్న మరో కారు ముందున్న దానిని ఢీకొట్టింది. ఈ క్రమంలో వెనుక ఉన్న కారును దాని వెనుక ఉన్న బొలేరో ఢీకొట్టింది. వరుసగా మూడు వాహనాలు ఢీకొనగా మధ్యలో ఉన్న కారు ముందు, వెనుక దెబ్బతినగా మిగిలిన రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఘటనలో మూడు వాహనాల్లో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి బంగారం అందజేత



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన శ్రీపాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయానికి ధరూరు మండలంలోని గార్లపాడుకు చెందిన ధర్మారెడ్డి, జయమ్మ దంపతులు అరతులం బంగారం విరాళంగా బుధవారం ఆలయ సిబ్బందికి అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి శేషవస్త్రాలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.